క్లుప్తంగా

నేడు సీ భవన్‌లో స్మృతి దివస్ కార్యక్రమాలు

ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో శుక్రవారం స్మృతి దివస్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 2012 జూన్ 12న ఎస్.ఎం.ఎస్-2 విభాగంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 19 మంది ఉద్యోగులకు నివాళులర్పించేందుకు ఏటా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సీ భవన్‌లో రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం, పేదలకు ఆహారం అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్ తెలిపారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో ఉచిత శిక్షణ

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాయి. ఈ విషయాన్ని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో పది రోజుల పాటు ఉచిత స్వల్పకాలిక శిక్షణను అందించనున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు 21 సంవత్సరాలు నిండి 55 ఏళ్లలోపు వారై ఉండాలి. శిక్షణకు హాజరయ్యే వారికి ఎలక్ట్రికల్ రంగంలో కనీసం ఒక సంవత్సరం అనుభవం తప్పనిసరి. శిక్షణ సమయంలో ఉచిత వసతితో పాటు, స్టేషనరీ కూడా ఉచితంగా అందజేస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం 9394885164 నంబర్‌కు సంప్రదించాలని రవికుమార్ సూచించారు.

మేయర్ దృష్టికి పెండింగ్ సమస్యలు



మేయర్ పీలా శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ అనూష, లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ పరిధిలోని 68వ వార్డులో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను తక్షణమే పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ గురువారం మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వార్డులో నిలిచిపోయిన వివిధ అభివృద్ధి పనుల గురించి కార్పొరేటర్ దంపతులు వివరించారు. ఈ పనులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్‌ను అభ్యర్థించారు. తమ విజ్ఞప్తిపై మేయర్ పీలా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ దంపతులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



ఎస్‌ఐ సుదర్శనరావును అభినందిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి 104 ఏరియా బాపూజీనగర్ వాలీబాల్ గ్రౌండ్ వద్ద ఈ నెల 10న జరిగిన చోరీ కేసులో నిందితులను క్రైం ఎస్‌ఐ ఎం.సుదర్శన్ పట్టుకుని, రిమాండ్‌కు తరలించారు. వెస్ట్ సబ్ డివిజన్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. ఈ నెల 10వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో స్థానికుడు ఎం.చిట్టిపడాల్, అతని స్నేహితుడు రాయిన అనీల్ కుమార్ వాలీబాల్ గ్రౌండ్ వద్ద కూర్చుని ఉండగా, పాత నేరస్తులైన సంపతిరావు సురేష్, గుమ్మడి కార్తీక్ వారిని బెదిరించి, వారి వద్ద ఉన్న వెండి చైన్, వెండి బ్రాస్‌లెట్ బలవంతంగా తీసుకుపోయారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ సుదర్శనరావు, సిబ్బంది కలసి కేసు దర్యాప్తు చేశారు. నిందితులను ఒక రోజులోనే గుర్తించి పట్టుకున్నారు. వారిలో సంపతిరావు సురేష్ గతంలో ఒక మర్డర్ కేసులో నిందితుడు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. అలాగే గుమ్మడి కార్తీక్‌పై కూడా పెందుర్తి స్టేషన్‌లో గంజాయి కేసులు, ఎయిర్‌పోర్టు స్టేషన్‌లో చైన్‌స్నాచింగ్ కేసులు ఉన్నాయి. వీరిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుదర్శన్‌రావును సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

తడబడుతూనే..

- పాఠశాలల పునఃప్రారంభం
- సౌకర్యాలపై తల్లిదండ్రుల పెదవి విరుపు
- పూర్తి స్థాయిలో రాని స్టూడెంట్స్ కిట్లు



గంగవరం పాఠశాలలో విద్యార్థులు



68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్‌లో ప్రవేశిస్తున్న విద్యార్థులు



కణితి హైస్కూల్లో విద్యార్థులు..



బడి బాట పట్టిన విద్యార్థినులు

పెదగంట్యాడ : పాఠశాలలు గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొన్ని పాఠశాలల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియగా, మరికొన్ని చోట్ల విద్యావ్యవస్థపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

మొదటి రోజు హాజరు ఇలా..

మండలంలోని 77 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 15 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బడి తెరిచిన మొదటి రోజున కొన్ని పాఠశాలల్లో 50 శాతం, మరికొన్నింటిలో 40 శాతం వరకు హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. నిన్నటిదాకా ఆటపాటల్లో మునిగి తేలిన చిన్నారులు, పాఠశాలలకు తిరిగి రావడంతో చదువులకు స్వాగతం పలికారు.

విద్యావ్యవస్థపై తల్లిదండ్రుల ఆవేదన

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యారంగం ప్రగతి పథంలో నడిచిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యా సంస్కరణలు ఒక ఉద్యమంలా సాగాయని, ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు గణనీయంగా పెరిగాయని వారు గుర్తు చేస్తున్నారు.

'నాడు–నేడు'పై కూటమి నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక.. 'నాడు–నేడు అభివృద్ధి పనులు అటకెక్కాయని, ఇంగ్లీష్ మీడియం బోధనకు మంగళం పాడారని, డిజిటల్ తరగతి గదులకు దూరమయ్యారని వారు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా, సబ్జెక్టు టీచర్లపై వేటు వేయడం, 'గోరుముద్ద' నాణ్యత తగ్గడం వంటి చర్యలు విద్యా వ్యవస్థను నీరుగార్చాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా కొన్ని పాఠశాలల్లో విద్యా ఫలితాలు దారుణంగా పడిపోవడంతో, ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో లోపాలు

బడి తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆ మాటలు ఉత్తిమాటలేనని తేలిపోయిందని విద్యార్థి సంఘ నాయకులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ ఏడాది మండలంలో కిట్లు పూర్తి స్థాయిలో రాలేదని, ముఖ్యంగా షూలు, సాక్సులు, బెల్టులు వంటివి కిట్లలో లభించకపోవడం ప్రభుత్వ వైఫల్యంగా వారు ఆరోపిస్తున్నారు. విద్యారంగంలో నెలకొన్న ఈ లోపాలను ప్రభుత్వం వెంటనే సరిచేయాలని విద్యార్థి సంఘ నాయకులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థుల సందడి

అక్కిరెడ్డిపాలెం: వేసవి కాలం అనంతరం స్కూల్స్ ప్రారంభయ్యాయి. గురువారం స్కూల్స్ ఓపెన్ కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా స్కూల్స్‌కు బారులు తీరారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అయా హెచ్‌ఎంలైన ఎం.ఎల్.ఎస్.కాంతం, ఆంజనేయులు గేటు వద్ద స్వాగతం పలికారు.

340 మంది మాత్రమే హాజరు

కూర్మన్నపాలెం : పాఠశాలలు తిరిగి ప్రారంభమైన మొదటిరోజు కణితి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సందడి సాధారణంగా కనిపించింది. పాఠశాలలో మొత్తం 710 మంది విద్యార్థులు ఉండగా, తొలిరోజు కేవలం 340 మంది మాత్రమే హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. హాజరైన విద్యార్థులు కూడా పాఠశాలకు సాధారణ దుస్తుల్లోనే వచ్చారు. మొదటిరోజు కావడంతో తరగతులు ఏవీ జరగకపోవడంతో విద్యార్థులు ఆటపాటలతో, కాలక్షేప కబుర్లతో గడిపారు.

38 మంది విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా కళాశాల (జగ్గరాజుపేట)కు చెందిన 30 మంది విద్యార్థినులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ కాగ్నిజెంట్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికై ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి మాట్లాడుతూ, కాగ్నిజెంట్ జెనెట్ సంస్థ మూడు విడతల్లో నిర్వహించిన వివిధ పరీక్షలలో ఈ విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

త్వరలో పద్మశాలీల జనగణన సర్వే



సమావేశంలో పాల్గొన్న పద్మశాలి సంఘం పెద్దలు

గాజువాక : ఉత్తరాంధ్రలో పద్మశాలీ కులస్తుల జనగణన కోసం త్వరలో సర్వే నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గాజువాకలో గురువారం నిర్వహించిన సంఘం ముఖ్య ప్రతినిధుల సమావేశంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకున్నట్టు ఆ సంఘం కన్వీనర్ పప్పు రాజారావు తెలిపారు. దీనికోసం ఈనెల 15న పద్మశాలి గ్లోబల్ యాప్‌ను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సర్వే రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతుందని, తమ కులానికి సంబంధించిన జనసంఖ్యా బలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయడం కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సర్వే తమ కులస్తులు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా ఎదగడం కోసం ఉపయోగపడాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్నామన్నారు. పద్మశాలి గ్లోబల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ సర్వే తొలుత ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖ నుంచి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు రాపర్తి సుబ్బారావు, చిక్కా సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, తెడ్ల సతీష్, కొల్లి కుంచారావు, దుబా రాజు, వానపల్లి జగ్గారావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు పొడిగింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్.ప్రసాద్‌కు ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ (ఫైనాన్స్) బాధ్యతలు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అండర్ సెక్రటరీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పోస్టుకు గతంలో జరిగిన ఇంటర్వ్యూలో ఎవరినీ ఎంపిక చేయకపోవడంతో ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

బీచ్‌రోడ్డు: స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన 4,500 మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి. ఆదినారాయణ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా విశాఖ స్టీల్ పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. 40 ఏళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించకపోవడం వల్లే నష్టాలు చవిచూస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహ్మాన్, కె. సత్యనారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్రావు, కార్యదర్శులు పి.చంద్రశేఖర్, పడాల గోవిందు, నాగభూషణం, సీహెచ్ కాసుబాబు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఎన్‌ఆర్‌ఎల్ పునరుద్ధరించాలి



స్టీల్‌ప్లాంట్ ట్రస్ట్ కార్యదర్శి రామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు 90 శాతం నాన్–రిటర్నబుల్ రుణ సౌకర్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్ కార్యదర్శి ఎస్. రామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పలు డిమాండ్లను ఐఎన్‌టీయూసీ నాయకులు రామ్‌ప్రసాద్ ముందుంచారు. ఉద్యోగులకు వలంటరీ ప్రావిడెంట్ ఫండ్ ఆప్షన్‌కు అవకాశం కల్పించాలని, త్రిఫ్ట్ రుణ వసూళ్లను పే స్లిప్‌లో కట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం కార్మికులకు అందుబాటులో ఉన్న పే సెక్షన్‌ను మార్చకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ఎస్‌ఏ నాయుడు, మొల్లి ఈశ్వరరావు, గోపాలరాజు, వెంకన్న, పోతారెడ్డి, రాజేష్, వైవీ సుబ్బారావు, మింది దేవుడు, బాలస్వామి, బంటు రాము, చట్టి సింహాచలం పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని వారు కోరారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో 'అల్ట్రా సౌండ్' సేవలు



అల్ట్రా సౌండ్ 2డి ఎకో స్కాన్ పరికరాలను ప్రారంభిస్తున్నషిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా : హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో సింధియాలోని కార్మిక బీమా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం అల్ట్రా సౌండ్ 2డి ఎకో స్కాన్ పరికరాలను గురువారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎస్‌ఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రీ , ఆయన సతీమణి వందన ఖత్రీ ముఖ్య అతిథులుగా హాజరై పరికరాలను ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మహిళల కోసం ఏర్పాటు చేసిన సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది మహిళలకు క్యాన్సర్ వ్యాక్సిన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హేమంత్ ఖత్రీ మాట్లాడుతూ కార్మిక బీమా ఆస్పత్రికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ అందించడం అత్యంత అవసరమని గుర్తించి, ఉద్యోగుల సహకారంతో దీనిని అందించగలిగామని అన్నారు. ఈ పరికరాలు షిప్‌యార్డ్ కార్మికులతో పాటు పరిసర ప్రాంతాల ఉద్యోగులకు కూడా ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా నేటి మానవ జీవన విధానాలలో మార్పుల వల్ల మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ ఇప్పించడం ఎంతో గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల మహిళల్లో బ్రెస్ట్, బోన్ క్యాన్సర్, గర్భాశయ సమస్యల నుంచి రక్షించుకోవచ్చునని ఆయన వివరించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ డైరెక్టర్ రాకేష్ ప్రసాద్, ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ రమణమూర్తి, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ కార్మిక నాయకులు శ్రీరామ్మూర్తి, కార్మికులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మ సేవలో..

- గ్రామీణ విద్యకు అండగా అమ్మఎడ్యుకేషనల్ ట్రస్ట్
- పేద విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తున్న అప్పలరాజు



శానిటరీ వర్కర్లకు మాస్కులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అతిథులు, అమ్మ ఎడ్యుకేషనల్ వ్యవస్థాపకుడు అప్పలరాజు

ఉక్కునగరం: సమాజాన్ని కూడా తన కుటుంబంగా భావిస్తూ స్టీల్ ప్లాంట్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్ (టీపీపీ) విభాగంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న మంత్రి అప్పలరాజు, తన సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వెచ్చిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా పేదరికం కారణంగా విద్యకు దూరం కాకూడదనే ఆశయంతో 'అమ్మ చారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించి, అనేక మంది విద్యార్థులకు విద్యాదానం, విద్యా సహాయం అందిస్తున్నారు.

దాదాపు 25 సంవత్సరాల క్రితం, వార్తాపత్రికలలో వచ్చిన ప్రభుత్వ గణాంకాలను చూసి అప్పలరాజు చలించిపోయారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పుస్తకాలు, దుస్తులు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేకపోవడం వల్ల చదువుకు దూరమవుతున్నారని, ముఖ్యంగా ఆడపిల్లలు 5వ తరగతి తర్వాత చదువు మానేయడానికి ఇవే ప్రధాన కారణాలని ఆయన గ్రహించారు. ఈ పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో ఆయన అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను స్థాపించారు.

ఎన్నో సేవలు

ట్రస్ట్ ద్వారా అప్పలరాజు ఎన్నో ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, యూనిఫాంలు, దుస్తులు అందిస్తున్నారు. ఆర్థిక స్థోమత లేక మధ్యలో చదువు ఆపేసిన అనేక మంది విద్యార్థిని, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి వారి చదువును కొనసాగేలా ప్రోత్సహించారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులను ఉపాధ్యాయుల సహకారంతో గుర్తించి, వారికి అవసరమైన విద్యా సామాగ్రిని అందిస్తున్నారు.

అవార్డులు, పురస్కారాలు

అప్పలరాజు చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన అనేక సంస్థలు ఆయనకు అవార్డులు, బిరుదులు, పురస్కారాలు ప్రకటించినా, ఆయన వాటిని సున్నితంగా తిరస్కరించారు. ట్రస్ట్ ఆలోచన, అమలు, బాధ్యతలన్నీ తన భుజాలపై వేసుకుని ఆయన సేవలను ప్రారంభించారు. తన సేవా కార్యక్రమాల గురించి తెలుసుకుని కొంతమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేసినట్లు అప్పలరాజు తెలిపారు. ఈ సేవల కారణంగా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు చదువు మానేయడం తగ్గిందని ఆయన పేర్కొన్నారు.

'ఆర్థిక స్థోమత లేదని చదువు ఆపేస్తాం అనే వారు ఉండకూడదు' అనే ఆశయంతో ట్రస్ట్ పనిచేస్తోంది. గత రెండేళ్లుగా విశాఖపట్నం ఉక్కునగరం విమల విద్యాలయంకు చెందిన 100 మంది పిల్లలకు ట్రస్ట్ ద్వారా స్కూల్ యూనిఫాం, కొంతమంది పిల్లలకు స్కూల్ ఫీజులు, పుస్తకాలు అందజేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా 100 మందికి తగ్గకుండా పిల్లలకు తమ సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. తన సేవా ప్రయాణంలో సహకరిస్తున్న వారందరి వల్లే ఇన్ని సేవా కార్యక్రమాలు చేయగలుగుతున్నానని అప్పలరాజు వినయంగా తెలియజేశారు.

కోవిడ్ సమయంలో..

కోవిడ్ మహమ్మారి సమయంలో కూడా అప్పలరాజు సేవలను కొనసాగించారు. ప్రతిరోజూ సుమారు 300 నుంచి 350 ఆహార పొట్లాలను పంపిణీ చేసి అనేక మంది ఆకలి తీర్చారు. అలాగే శానిటైజర్లు, మాస్కులను పంపిణీ చేశారు. వేల సంఖ్యలో పుస్తకాలు, పాఠశాల సామాగ్రి, ఎంతో మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించినప్పటికీ, ఆయన ఎప్పుడూ సన్మానాలను, ప్రచారాలను ఆశించలేదు. గత 24 ఏళ్లుగా ఆయన సేవా కార్యక్రమాలను నిరాడంబరంగా కొనసాగిస్తున్నారు.



ట్రస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ వేణుగోపాలరావు (ఫైల్)

గ్రామీణ విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి



గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి చెందుతుందని భావిస్తున్నాను. ప్రస్తుతం నిరంతరంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తా..ఈ ఆశయసాధనలో కలిసి వచ్చే అందరితో ముందుకు సాగుతాను.

– మంత్రి అప్పలరాజు, చైర్మన్, అమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్

కేంద్ర విధానాలపై నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఉక్కునగరం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో గురువారం జాతీయ స్టీల్ సంఘీభావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి జె. రామకృష్ణ మాట్లాడుతూ, గత నెలలో జైపూర్‌లో జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూలు) ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘీభావ దినోత్సవం జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణను తక్షణమే విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, హెచ్‌ఆర్‌ఏను పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలను తగ్గించాలని, వేతన సవరణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మసేనురావు, డొక్క నర్సింగరావు, ఎస్. మోహన్‌బాబు, శివరామకృష్ణ, కనకరాజు, చీకటి శ్రీనివాస్ తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కేవీలో మిగులు సీట్ల భర్తీ ప్రక్రియ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ)కు చెందిన మిగులు సీట్లు ప్రక్రియ ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్నదని కేవీ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. 4,5,6,9,10,12 తరగతులకు మిగిలిన సీట్లను ఆఫ్‌లైన్‌లో భర్తీ చేయనున్నామన్నారు. ఆ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. తుది ఫలితాలు జూన్ 20న లాటరీ ప్రక్రియ ద్వారా వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం

గోపాలపట్నం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీసులను ఆశ్రయించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటన జీవీఎంసీ 52వ వార్డు, ఎన్‌ఏడీ సమీపంలోని గణేష్‌నగర్‌లో చోటుచేసుకుంది. గణేష్‌నగర్‌కు చెందిన పురెడ్డి వెంకటేశ్వరరావు కుమార్తె పురెడ్డి ఆశా దీప్తి, ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉమెన్ హెచ్‌సి పి. మహాలక్ష్మి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ యువతి ఆచూకీ తెలిసిన వారు 9440904350 తెలియజేయాలని పోలీసులు కోరారు.

సన్నబియ్యంపై ఎండీఎం ఆరా



భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరా అధికారి జయంతి

అగనంపూడి: పాఠశాలల్లో గురువారం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పౌరసరఫరా మేనేజర్ జయంతి, లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిపై ఆరా తీశారు. గతంలో అందించిన భోజనానికి, ఇప్పుడు అందిస్తున్న సన్నబియ్యం భోజనానికి తేడా ఏమైనా ఉందా, రుచికరంగా ఉందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మేనేజర్ జయంతి, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం



మొక్క నాటుతున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపులో భాగంగా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో మొక్కలు నాటాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. మోదీ పిలుపు మేరకు ఆయన 72వ వార్డు పాతకర్ణవానిపాలెం లోని ప్రాథమిక పాఠశాలలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి ప్రతిరోజు నీరు పోసి పెంచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాభాయి, నాయకులు నాగేశ్వరరావు, రంగనాయకులు, మనోహర్, రాజశేఖర్, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.